సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




ఆదివారం 05 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 307 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్





## బాసర ఆలయ అభివృద్ధికి రూ.225 కోట్ల మాస్టర్ ప్లాన్‌కు సీఎం ఆమోదం

సందేశం టైమ్స్, బాసర, ఏప్రిల్ 5, ప్రతినిధి: బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం అభివృద్ధికి సంబంధించి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను అధికార యంత్రాంగం ముఖ్యమంత్రికి వివరించగా, సీఎం పలు కీలక సూచనలు చేశారు. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని, భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ శాస్త్రోక్తంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో కేవలం ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తిరుమల తరహాలో ఆలయ ప్రాంతాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 6న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనుండగా, సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

## బీసీ కాంట్రాక్టర్ల ధర్నాకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మద్దతు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: బీసీ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న నిర్వహించనున్న మహా ధర్నాకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీ కార్యాలయంలో బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి మద్దతు కోరగా, మల్లన్న స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం వల్ల కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ కాంట్రాక్టర్లకు 42 శాతం కాంట్రాక్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి వారికి రావాల్సిన వాటాను న్యాయంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్ 8న గన్ పార్క్ వద్ద జరిగే ధర్నాకు తాను స్వయంగా హాజరవుతానని, బీసీ కాంట్రాక్టర్ల హక్కుల కోసం ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. “బీసీ కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు” అని మల్లన్న స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ సాధికారతకు తెలంగాణ మరో ముందడుగు నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభం



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: ట్రాన్స్‌జెండర్‌ల సామాజిక, ఆర్థిక సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తూ ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం గచ్చిబౌలి లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణ, మెట్రో సెక్యూరిటీ రంగాల్లో ట్రాన్స్‌జెండర్‌లకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు స్వయం ఉపాధికి దోహదపడేలా కార్ డ్రైవింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రోన్ పైలట్ శిక్షణలను అందించనున్నట్లు వెల్లడించారు. డ్రైవింగ్ శిక్షణను మారుతి డ్రైవింగ్ స్కూల్ సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయం, ఈవెంట్‌లలో విస్తృత వినియోగం ఉందని, ఈ శిక్షణతో ట్రాన్స్‌జెండర్‌లు భవిష్యత్ రంగాల్లో ముందుకు సాగగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం 91 మంది ట్రాన్స్‌జెండర్‌లకు శిక్షణ అందించగా, ఇందుకు రూ.17.72 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని స్పష్టం చేశారు. సమాజంలో సమాన హక్కులతో ట్రాన్స్‌జెండర్‌లు ముందుకు సాగాలని, వారిని భాగస్వాములుగా గుర్తిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పీడబ్ల్యూడీలు & టీజీపీ డైరెక్టర్ శైలజ, నితిహెచ్‌ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ, తెలంగాణ రాష్ట్ర ఏవియేషన్ అకాడమీ సెక్రటరీ & సీఈఓ కెప్టెన్ ఎస్.ఎన్. రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా గవర్నర్ శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న మహానుభావుడని పేర్కొన్నారు. పీడిత వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అమూల్యమని, సమానత్వం మరియు సమగ్ర అభివృద్ధి పట్ల ఆయన నిబద్ధత భారతదేశాన్ని ప్రగతిశీల దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఆయన వారసత్వం ఎప్పటికీ నిలిచి ఉండాలని, సమానత్వం, సహానుభూతి, సమగ్రతతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరికి స్ఫూర్తినివ్వాలని గవర్నర్ ఆకాంక్షించారు.



## ఈ నెల 6 నుంచి హెల్త్ వీక్ నిర్వహణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6 నుంచి 11 వరకు హెల్త్ వీక్ నిర్వహించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, వారం రోజుల పాటు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 6న ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డేగా నిర్వహిస్తూ హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద ఈట్ రైట్ వాక్, నేచురోపతి ఆసుపత్రిలో మిల్లెట్ మేళా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిమ్స్ లో అత్యాధునిక LINAC సేవలను ప్రారంభించడంతో పాటు, కేన్సర్ రిజిస్ట్రీ ప్రారంభం, ట్రామా కేర్ పాలసీ, పలు పోర్టల్స్ ప్రారంభం, 871 మంది డాక్టర్లకు నియామక పత్రాల పంపిణీ జరగనుంది. ఏప్రిల్ 8న సేఫ్ మదర్ డేగా కార్యక్రమాలు నిర్వహించి, ప్రసూతి సేవలపై అవగాహన కల్పించనున్నారు. తదుపరి రోజుల్లో ఎయిడ్స్ అవగాహన కోసం రెడ్ రన్, యోగా కార్యక్రమాలు, హోమియోపతి సెమినార్లు, వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 11న డ్రగ్స్ కంట్రోల్ డేగా నిర్వహిస్తూ మెడిసిన్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు, గాంధీ ఆసుపత్రిలో డీ అడిక్షన్ క్యాంపు నిర్వహించనున్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.



## ఎన్నికల తర్వాతే కేబినెట్ విస్తరణ – సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర కేబినెట్ విస్తరణపై స్పష్టత ఇచ్చారు. వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తైన తరువాతే మంత్రివర్గాన్ని విస్తరించి, పూర్తిస్థాయి కేబినెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేరళలో రెండు రోజులపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా చివరి రోజు మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. కేరళ, పాండిచ్చేరి, అస్సాం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేబినెట్ విస్తరణ వాయిదా వేసినట్లు తెలిపారు.

# గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి: లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, గజ్వేల్, ఏప్రిల్ 5, ప్రతినిధి: గజ్వేల్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటు ఘటనగా బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ఒక్క కేసీఆర్ కార్యాలయంపైనే కాకుండా ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్ష నేతకే రక్షణ కల్పించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం, హోంశాఖ ఉన్నప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, నిరుద్యోగులు, మీడియాపై దాడులు నిత్యకృత్యంగా మారాయని ఆరోపిస్తూ ఈ ఘటన సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే జరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజల పక్షాన పోరాడే నాయకులపై దాడులు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ దాడిపై గవర్నర్ తక్షణమే పూర్తి దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమైన ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహణ





సందేశం టైమ్స్, కోదాడ టౌన్, ఏప్రిల్ 5, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా బాలల పరిరక్షణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జి. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనిలో కాకూడదని పేర్కొన్నారు. బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు నేరమని తెలియజేస్తూ మిషన్ వాత్సల్య పథకం ద్వారా మత్తు పదార్థాలకు బానిసలైన బాలలకు పునరావాసం కల్పించడం, అనాథ బాలలకు స్పాన్సర్ షిప్, చట్టబద్ధమైన దత్తత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బాలల రక్షణ కోసం 100, 108, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సంస్కార వికాస సాధన యోగ విజ్ఞాన శిబిరంలో మానవ అభ్యుదయ అధ్యయన సంస్థ ఆచార్య రమేష్ గురూజీ పాల్గొని విద్యార్థులకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, చదువుపై శ్రద్ధ, సృజనాత్మకత పెంపొందించే విధానాలను వివరించారు. చదువుతో పాటు సంస్కారం కూడా ముఖ్యమని, తల్లిదండ్రులు, గురువులు, అతిథులను గౌరవించాలని సూచించారు. మానవతా విలువలు, సేవా నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తూ ప్రారంభించిన పనిని మధ్యలో వదిలేయకుండా 100 శాతం పూర్తి చేసే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి ఎండి. సలీం షరీఫ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కోదాడలో మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగింపు

సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 5, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని 21వ వార్డులో మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నాలుగు రోజులుగా కొనసాగుతూ విజయవంతంగా నిర్వహించబడుతోంది. వార్డు కౌన్సిలర్ ఆర్‌పి కృష్ణ, హసీనా చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి స్థానిక ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంకా మూడు రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజలు మంచి స్పందన తెలుపుతున్నారని తెలిపారు.

# వరకట్నం, బాల్య వివాహాలపై గ్రామస్థులకు చట్టపరమైన అవగాహన

సందేశం టైమ్స్, చివ్వేముల, ఏప్రిల్ 5, ప్రతినిధి: గౌరవనీయ భారత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రామ ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించేందుకు సూర్యాపేట జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో చివ్వేముల గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వరకట్నం, మహిళలపై క్రూరత్వం (సెక్షన్ 498-ఎ ఐపీసీ), వరకట్నం మరణం (సెక్షన్ 304-బి ఐపీసీ) వంటి నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న వరకట్నం మరణాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని, పిల్లలపై క్రూరంగా ప్రవర్తించరాదని తెలిపారు. అలాగే అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి కాకముందు వివాహం చేస్తే అది బాల్య వివాహంగా పరిగణించి శిక్షార్హమని హెచ్చరించారు. సమాజంలో ఆడ, మగ తేడా లేకుండా అందరూ సమానమనే భావనను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నల్లమల హాసన్, డీఎల్ఎస్ఏ నామినేటెడ్ మెంబర్ గుంటూరు మధు, నల్లపాటి మమత, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. ప్రియదర్శిని, సర్పంచ్ కళ్యాణి, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎమ్మార్వో చంద్రశేఖర్, ఎస్సై కనక రత్నం, మండల సమైక్య అధ్యక్షురాలు డి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.




# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో విస్తృతంగా పాల్గొనాలి: కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 5, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు ఆర్ అండ్ బి కార్యాలయం పక్కన ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలోని కల్వకుంట రోడ్డుపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో జగ్జీవన్ రామ్ గారి సేవలను స్మరించుకుంటూ సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిపై ఆయన చూపిన మార్గాన్ని వివరించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఆయన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా యువత జగ్జీవన్ రామ్ గారి జీవితం నుంచి ప్రేరణ పొందాలని, సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.




## ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 5, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి పురోగతి సాధించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు సమగ్ర శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలో సిబ్బందికి శిక్షణ పూర్తిచేసినట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు సూర్యనారాయణ, వేణు మాధవరావు, శ్రీనివాసులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి ఖండన మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శలు



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 5, ప్రతినిధి: గజ్వేల్‌లో కే. చంద్రశేఖర్ రావు క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని పేర్కొంటూ, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ కార్యాలయంపై దాడి జరగడం ప్రజల గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి దాడులు జరగడం ఆందోళనకరమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అలాగే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి చర్యలకు ప్రజలు తగిన సమయంలో సమాధానం ఇస్తారని హెచ్చరిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అంగన్వాడీ కేంద్రంలో 'యానివల్ డే' వేడుకలు – చిన్నారుల సందడి



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 5, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని చప్తాకే గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సంవత్సరం ముగింపు సందర్భంగా 'యానివల్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ జగదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మెత్రి సంగమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదేవి మాట్లాడుతూ చిన్నారులను మూడు సంవత్సరాల వయస్సు నుంచే అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా క్రమశిక్షణ, మంచి అలవాట్లు, ప్రాథమిక విద్యతో పాటు సామాజిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలలోని ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చిన్నారులు వివిధ జంతువుల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. 4 ప్లస్, 5 ప్లస్ వయస్సు గల పిల్లలకు అసెస్మెంట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బస్వారాజ్, హై స్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సీడీపీఓ సుజాత, సూపర్వైజర్ మంజుల తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జహీరాబాద్‌లో 'రన్ ఫర్ జీసస్' భారీ ర్యాలీ – పాల్గొన్న డా. చంద్రశేఖర్




సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో CYAZ (క్రిస్టియన్ యూత్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్' భారీ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్ లో జరిగిన సభలో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమం క్రైస్తవ సంఘాల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలు శాంతియుతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు మాక్సూద్ అహ్మద్, కౌన్సిలర్లు మహేష్, చౌహాన్ వాకీల్, కాంగ్రెస్ నాయకుడు హుగ్గెల్లి రాములు, CYAZ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన డా. చంద్రశేఖర్



సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గ్రీన్ వ్యాలీలో మాజీ మునిసిపల్ చైర్మన్ మహంకల్ శుభాష్ గారి సతీమణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఈ విషయం తెలిసిన మాజీ మంత్రి, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు మాక్సూద్ అహ్మద్, కౌన్సిలర్లు మహేష్, చౌహాన్ వాకీల్, కాంగ్రెస్ నాయకులు హుగ్గెల్లి రాములు, శాంసన్, జైరాజ్, చిన్నా, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇమ్మడి గోపి ముదిరాజ్ హత్యపై ఆగ్రహం – దోషులకు కఠిన శిక్షల డిమాండ్





సందేశం టైమ్స్, నిజామాబాద్, ఏప్రిల్ 5, ప్రతినిధి నిజామాబాద్: ఇమ్మడి గోపి ముదిరాజ్ హత్యపై డా. బి. విఠల్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్పల్లి మండలం సీతాయిపేట గ్రామంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగిన నాయకుడిని రాజకీయ కుట్రలో హత్య చేయడం accepter చేయలేమని, ఈ ఘటన రాష్ట్రంలో రాజకీయ నియంత్రణలో ఉన్న వర్గాల కవరెన్స్ కింద జరిగిందని స్పష్టం చేశారు.ముదిరాజ్ జాతిని బలహీనపర్చేందుకు ఆధిపత్య వర్గాలు ప్రయత్నిస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు అసాధ్యమని, దోషులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పండగ సాయన్న, కేవల్ కిషన్, ఎర్ర సత్యం వంటి నాయకుల హత్యలను గుర్తు చేసుకుని, భవిష్యత్‌లో ఆవేశాలకు లోనుకాకుండా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని జాతి నాయకులను సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కే. రమేష్ ముదిరాజ్, నర్సింగ్ ముదిరాజ్, కార్తీక్ ముదిరాజ్, బాలకృష్ణ ముదిరాజ్, రఘు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ TOSS పరీక్షలు సజావుగా నిర్వహణ – జిల్లా అదనపు కలెక్టర్ పాండు ప్రత్యేక సమీక్ష



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 5, ప్రతినిధి సంగారెడ్డి జిల్లా: ఏప్రిల్ మరియు మే 2026లో జరగనున్న ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ (TOSS) పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా అధికారులు పూర్తి ఏర్పాట్లలో ఉన్నారు. ఈ విషయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పాండు శనివారం జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో సమీక్షించారు.అధ్యక్షతనందించిన కలెక్టర్ పాండు, పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, మెడికల్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని, పరీక్షా ప్రశ్నపత్రాల రవాణా, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను కేంద్రాల్లో తీసుకురావడం అనుమతించరాదని స్పష్టం చేశారు.పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 27 వరకు రోజుకు రెండు సెషన్లలో జరగనుండగా, జిల్లాలో మొత్తం 28 కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎస్ఎస్‌సి పరీక్షలకు 2,692 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 5,065 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పరీక్షలు సజావుగా, పారదర్శకంగా, ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు పూర్వప్రణాళికలతో ముందుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## పాపమ్మ గడ్డ కాలనీలో విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం



సందేశం టైమ్స్, మనూర్, ఏప్రిల్ 05, నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రతినిధి, సంగారెడ్డి జిల్లా:నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని "పాపమ్మ గడ్డ" కాలనీలో నెలలుగా 33 కేవీ విద్యుత్ లైన్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు, ప్రమాద భయంతో జీవిస్తున్నారు. సమస్యను గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, కాలనీవాసులు నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పి. సంజీవరెడ్డి మరియు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ దృష్టికి తీసుకెళ్లారు.వారు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించడంతో, ఈరోజు సర్పంచ్ పంచగామ బీరప్ప స్వయంగా పర్యవేక్షణలో 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలను ఎత్తుగా ఏర్పాటు చేసి, వైర్లను సురక్షిత స్థాయికి పైకి ఎత్తే పనులను పూర్తి చేశారు. ఈ తక్షణ పరిష్కారంతో కాలనీవాసులకు ఉపశమనం లభించింది. కార్యక్రమం సందర్భంగా గ్రామ పెద్దలు, కాలనీవాసులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ట్రిబుల్ ఆర్ భూసేకరణపై రైతుల ఆగ్రహం మార్కెట్ విలువ ఆధారంగా నష్టపరిహారం డిమాండ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 05, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నాగపూర్ ప్రాంతంలోని రైతులు, ట్రిబుల్ ఆర్ రోడ్ కోసం ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణ విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ, భూములను 2013 సంవత్సర మార్కెట్ విలువ ఆధారంగా సేకరించడం అన్యాయం అని, రైతులను మోసం చేసే విధానమని తీవ్రంగా విమర్శించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ బాధితులతో నిర్వహించిన సమావేశంలో, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం న్యాయమైన నష్టపరిహారం చెల్లించి భూసేకరణను వేగవంతం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గౌడ్, రామా గౌడ్, ఆనంద్ గౌడ్, అశోక్ గౌడ్, నాగరాజు గౌడ్, నరసింహా గౌడ్ తదితర రైతులు పాల్గొన్నారు.

## జీతాలు లేకపోతే నీటి సరఫరా నిలిపివేత – మిషన్ భగీరథ కార్మికుల హెచ్చరిక



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 05, ప్రతినిధి:.సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ తాలూకాలోని మిషన్ భగీరథ కార్మికులు పెండింగ్ జీతాల చెల్లింపునకు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. మానూర్ మండలం బోరంచ గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్ద శనివారం సమ్మెకు దిగిన కార్మికులు, గత ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ స్పందన లేకపోవడంతో నిరసనను ఉధృతం చేస్తూ మూడు రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశామని పేర్కొన్నారు. జీతాలు వెంటనే చెల్లించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం అవుతుందని కార్మికులు హెచ్చరించారు.



## ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి – రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 05, ప్రతినిధి సంగారెడ్డి జిల్లా: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ప్రత్యేకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులు, కలెక్టర్లకు సూచించారు.శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షలో ప్రతి పోలింగ్ స్టేషన్‌కి బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం తక్షణమే జరగాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఈ కార్యక్రమంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నారని, ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహించడానికి సూచనలు ఇవ్వగా, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్వప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఈఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, తహసీల్దార్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది



సందేశం టైమ్స్, నర్సాపూర్, ఏప్రిల్ 05, ప్రతినిధి: వి. సాయి ,నర్సాపూర్‌లో క్రైస్తవ మత పెద్దలు మరియు మతస్థుల ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్' అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ర్యాలీ రూపంలో నర్సాపూర్ నుండి కాసాలా, నాగులపల్లి, కొన్యాల వరకు సాగింది. సంఘం బాలు, కోఆర్డినేటర్ ఏసు రత్నం, అరుణ్, సాగర్, శ్రీను, శేఖర్, ప్రవీణ్ సహా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమైన శాంతి, సామూహిక భాగస్వామ్యం అనుభూతి లభించింది.

## సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 05, ప్రతినిధి: బి. సంగమేశ్వర్, సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల కేంద్రంలో MPDO కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు సిఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యం. సుధాకర్ రెడ్డి, మునిపల్లి మండల అధ్యక్షులు సతీష్ కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్, చిన్న చెల్మెడ సర్పంచ్ గాయత్రి రుద్ర కృష్ణ హాజరై 41 మంది లబ్ధిదారులకు మొత్తం 14,50,000/- రూపాయల విలువగల చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో మునిపల్లి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## క్యాతన్‌పల్లి మున్సిపల్‌లో బీఆర్ఎస్ ఆధిక్యత గొడిసల సంధ్యారాణి చైర్మన్‌గా ఎన్నిక



సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, మెదక్ నియోజవర్గం ప్రతినిధి.క్యాతన్‌పల్లి మున్సిపల్‌లో జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీహెచ్‌ఎల్ రాష్ట్రీయ సమితి (బీఆర్ఎస్) దళం ఘన విజయం సాధించింది. 14 మంది బీఆర్ఎస్-సీపీఐ కూటమి కౌన్సిలర్ల హాజరుతో జరిగిన ఎన్నికలో గొడిసల సంధ్యారాణి బీఆర్ఎస్ తరఫున చైర్మన్‌గా, మిట్టపల్లి సరిథ్ సీపీఐ తరఫున వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.కౌన్సిల్‌లో మెజార్టీ లేకపోవడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎన్నికలో చేతులెత్తి వున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ ఎన్ని ప్రలోభాలు చూపించినా, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తన నిర్ణయంలో మట్టిగట్టారు.ఈ ఫలితంతో మున్సిపల్‌లో బీఆర్ఎస్-సీపీఐ కూటమి ఆధిక్యత స్పష్టమై ప్రజాస్వామిక విధానంలో కొత్త దశను సూచించింది.

## మహనీయుల జయంతి కార్యక్రమం పోస్టర్ విడుదల



సందేశం టైమ్స్ మెదక్, ఏప్రిల్ 05, ప్రతినిధి: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, సభ్యులు, బహుజన నాయకులతో కలిసి మహనీయుల జయంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సభ నిర్వాహకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 13న జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో బాబు జాగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నలిగంటి శరత్ చామర్, అరుణ గోగులమండ ప్రధాన వక్తలుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులు అరిటిక్యాల శంకరయ్య, పొట్టిపల్లి మొగులయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, బహుజన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్రరం దేవదాస్, సర్పంచులు రమేష్, యాదగిరి, భాస్కర్, ఉపసర్పంచ్ నత్తి సందీప్ కుమార్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల రమేష్, మ్యాదరి కరుణాకర్, గార్లపల్లి మల్లేశం, అంబేద్కర్ సంఘాల నాయకులు ఉప్పరి దేవదాస్, అనిల్, శ్రీకాంత్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈవీఎం గోదాం పరిశీలన భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి

సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, మెదక్ నియోజికవర్గం ప్రతినిధి,మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఈవీఎం (EVM) గోదాం పరిశీలన నిర్వహించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, డబుల్ లాక్ సిస్టమ్ వంటి అంశాలను సవివరంగా సమీక్షించారు.కలెక్టర్, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటానికి ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా గోదాంలోని భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్చెరు రేషన్ షాప్ ముందు భారీ క్యూ వసతులతో సమస్యలేని రేషన్ పంపిణీ



సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, పటాన్చెరు మండల్ ప్రతినిధి బి. డేవిడ్,పటాన్చెరు డివిజన్లోని నాయి కోటి బస్తీ ప్రాంతంలో ఉన్న రేషన్ షాప్ ముందు పెద్ద సంఖ్యలో ప్రజలు క్యూ కట్టి నిలిచారు. షాప్ డీలర్ నాయి కోటి రాజు మాట్లాడుతూ, షాప్ కు వచ్చినవారు ఎవరూ ఇబ్బంది పడకుండా చూడాలని తెలిపారు. అందువల్ల ఎండలో నిలకడగా ఉండకూడని విధంగా టెంట్ల ఏర్పాటు చేయడం, త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.రేషన్ పంపిణీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని డీలర్ వెల్లడించారు. ఇలాంటి సౌకర్యాల కారణంగా భారీ సంఖ్యలో ప్రజలు క్యూ కట్టారని ఆయన పేర్కొన్నారు.

## పటాన్చెరు లో భార్యని హత్య హత్యచేసిన భర్త నిందితుడు పరారీలో నుండి అరెస్టు



సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, పటాన్చెరు టౌన్ ప్రతినిధి వి. సాయి ,పటాన్చెరు లోని ఏపీ ఆర్ కాలనీలో శనివారం ఉదయం ఘోర సంఘటన చోటుచేసుకుంది. లగ్జరీ విల్లా నం. 94 లో భర్త పరమేశ్వర్ రావు మతి స్థిమితం తప్పి, 55 ఏళ్ల భార్య లీలావతిని గొంతు కోసి హత్య చేశాడు. స్థానికులు అరుపులు విన్న తరువాత సంఘటన స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులు సమాచారమందించారు.పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సంగారెడ్డి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. సంఘటనపై వెంటనే దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై ఎన్. రాజు, ఘటనా జరిగిన మూడు గంటల లోపు నిందితుడు పరమేశ్వర్ రావును బీరంగూడ కామన్ వద్ద పట్టుకొని కస్టడీలోకి తీసుకున్నారని తెలిపింది.

## కంగ్టి మండల కేంద్రంలో భారీ కుస్తీ పోటీలు పహిల్వాన్లు రంగంలో



సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి,కంగ్టి మండల కేంద్రంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నేడు భారీ కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శివ రుద్రప్ప తెలిపారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రం మాత్రమే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పహిల్వాన్లు పాల్గొననున్నారు. గ్రామస్తుల సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. విజేతలకు తక్షణమే బహుమతులు అందజేయాలని ఏర్పాటు చేసారని చెప్పారు. క్రీడాభిమానులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## సంగారెడ్డిలో ఘనంగా 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ




సందేశం టైమ్స్, ఏప్రిల్ 05, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: సంగమేశ్వర్,సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సంగారెడ్డి పాత బస్టాండ్ నుంచి సి ఎస్ ఐ చర్చి వరకు ఘన ర్యాలీగా జరిగింది. ర్యాలీలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం, యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్, యూత్ పలు సంఘాల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాలనీల మౌలిక వసతలకు ప్రథమ ప్రాధాన్యత ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 05, ప్రతినిధి డేవిడ్:.ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన ముత్తంగి డివిజన్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం డివిజన్ పరిధిలోని డిఎన్ కాలనీ, న్యూ టౌన్ కాలనీలను ఎమ్మెల్యే పర్యటించి కాలనీ వాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ప్రధాన కాలనీలు ఏర్పడినప్పుడు నిర్మించిన సీసీ రోడ్లు, అంతర్గత మురికినీటి కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరినవి, వీటిని ఆధునికరించాలని సూచించారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారం ధ్యేయంగా పనిచేస్తున్నారని, అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు సిల్వేరి శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా, కుమార్ గౌడ్, మిరాజ్ ఖాన్, కిట్టు, సందీప్, రామకృష్ణ, యాదగిరి, బాబుల్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా అన్నదాన కార్యక్రమం – బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 05, ప్రతినిధి: పటాన్చెరు పట్టణ కేంద్రంలోని CSI మౌంట్ కల్వారి చర్చి యూత్ వింగ్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని బస్టాండ్ ప్రాంగణంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పృథ్వీరాజ్ గారు మాట్లాడుతూ, గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పర్వదినాలు ప్రేమ, సేవా భావం మరియు త్యాగానికి ప్రతీకలని పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మానవత్వాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని చెప్పారు.కార్యక్రమంలో దినకర్, ప్రశాంత్, నరేష్, జీవన్, క్రైస్తవ సోదరులు, చర్చ్ యూత్ వింగ్ సభ్యులు, MPR యువసేన సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## న్యూ బోధి స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే...

### విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించిన గ్రాడ్యుయేషన్ డే







సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 05, ప్రతినిధి:సంగారెడ్డి పట్టణ పరిధిలోని న్యూ బోధి స్కూల్లో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబాస్కాస్ మరియు ఈ ఎల్ ఎల్ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు మోడల్స్ అందజేయడం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వం ఎడ్యుకేషన్ స్కూల్ ల్యాబ్స్ మార్కెటింగ్ మేనేజర్ నరేష్ గారు హాజరయ్యారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. లింగం గారు, కరస్పాండెంట్ రవికుమార్, సిబ్బంది ప్రీతిక, మానస, మాధవి, హబీబా, శ్వేత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు కార్యక్రమంలో పాల్గొని గ్రాడ్యుయేషన్ డే విజయవంతం చేశారు.

## ఏప్రిల్, మే, జూన్ రేషన్ సరఫరా పూర్తి: ఈ నెల 30 వరకు అందజేయబడనుంది



సందేశం టైమ్స్ మెదక్, ఏప్రిల్ 05, ప్రతినిధి: మెదక్ జిల్లా, మెదక్ జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్ తెలిపారు, మొత్తం 520 రేషన్ దుకాణాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని. అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన మూడు నెలల సన్న బియ్యం నిల్వలు రేషన్ షాపుల్లో సమృద్ధిగా ఉంచబడి, నిరంతరంగా సరఫరా అవుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 30 వరకు ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి లబ్ధిదారుడు ఎలాంటి తొందరపాటు లేకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకోవాలని కోరారు.జిల్లా పరిపాలన తరఫున సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని, సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పని చేస్తున్నారని నిత్యానంద్ తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనపుడు సమీప తహసీల్దార్ కార్యాలయం లేదా సివిల్ సప్లై అధికారులను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: రాష్ట ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్ మెదక్, ఏప్రిల్ 05, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి పురోగతి సాధించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించి ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు సమగ్ర శిక్షణ అందించడంతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫారం 6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం క్రమబద్ధంగా కొనసాగుతోందని, సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా కనీసం 50 శాతం మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.